సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 17 । మార్చి । 2024



కేసుల పరిష్కారం సులభతరం

రాజీ మార్గంలో కేసులను పరిష్కారం చేసుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి పేర్కొన్నారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా)	సహర్ సోమ (ఉ)
కడప	6.30	5.07
పులివెందుల	6.33	5.02
ప్రొద్దుటూరు	6.32	5.11

గరిష్ఠం/కనిష్ఠం 41.2/26.6

వాతావరణం

జిల్లాలో శనివారం 26.6 – 41.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.35 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : సోమవారం వైఎస్సార్ జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణీకులు తమ సూచనలు, సమస్యలను 99592 25848 నంబరులో తెలియజేయవచ్చని వివరించారు.

23న వైవీయూ వ్యవస్థాపక దినోత్సవం



కమిటీల కన్వీనర్లతో చర్చిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం, పీజీ కళాశాల ఉత్సవం ఈనెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం వేడుకల నిర్వహణకు ఏర్పాటు చేసిన పలు కమిటీలు, కన్వీనర్లతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 23వ తేదీన కార్యక్రమాలు, సభా సమన్వయం, సాంస్కృతిక కార్యక్రమాల గురించి చర్చించారు. కన్వీనర్ల సూచనలు, సలహాలు స్వీకరించారు.

అమరజీవి త్యాగం ఆదర్శనీయం



అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో

కడప సెవెన్‌రోడ్స్: ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని స్పందన హాలులో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం వరుసగా 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి, చివరికి జాతికోసం ప్రాణాలర్పించిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని అన్నారు. మైనారిటీస్ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య పొట్టిశ్రీరాములు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డీఆర్వోతో పాటు పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు.

24లోపు పీసీపీఎన్‌డీటీ సమావేశాలు

రాయచోటి అర్బన్: ఈ నెల 24వ తేదీలోపు పీసీపీఎన్‌డీటీ(గర్భస్థ పిండ లింగనిర్ధారణ) ఏఆర్‌టీ చట్టాల అమలుకు సంబంధించిన సమావేశాలను ఈ నెల 24వ తేదీలోపు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. శనివారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ జిల్లాలోని పీసీపీయన్‌డీటీ టీం సభ్యులతో విజ యవాడ నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు.

పది పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకట కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పది పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని పది పరీక్షల జిల్లా పరిశీలకులు మర్తాల వెంకట కృష్ణారెడ్డి సూచించారు. శనివారం కడపలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈఓ మర్రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో పది పరీక్షల నిర్వహణపై ఫ్లయింగ్ స్క్వాడ్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్వాడ్ సిబ్బందికి కేటాయించిన కేంద్రాలను తప్పని సరిగా విజిట్ చేసి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏవైనా సంఘటనలు చోటు చేసుకుంటే జిల్లా విద్యాశాఖ అధికారి, పరీక్షల పర్యవేక్షణ అధికారికి వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైన జరిగినట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత చీఫ్, డిపార్టుమెంట్, ఇన్విజిలేటర్లపైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెట్లు, డిపార్టమెంట్ అధికారులకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 153 పరీక్ష కేంద్రాల్లో 27,859 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎన్నికల రణరంగానికి రెడీ

- అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- అభ్యర్థుల ఎంపికలో వెనుకబడిన తెలుగుదేశం పార్టీ
- ప్రచారం సైతం కొనసాగిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి కడప: ఎన్నికల రణరంగానికి రాజకీయ పార్టీలు సిద్ధమయ్యాయి. అనేక రాజకీయ పార్టీలు పోటీలో ఉన్నా జిల్లాలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. కాగా ఈమారు బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు జట్టు కట్టాయి. వైఎస్సార్ జిల్లాలో 7 అసెంబ్లీ, కడప పార్లమెంట్ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను శనివారం ప్రకటించారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించి కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, పులివెందుల అభ్యర్థులు మాత్రమే ఖరారయ్యారు. కడప పార్లమెంట్‌తోపాటు, జమ్మలమడుగు, బద్వేల్ అభ్యర్థుల ఎంపిక పూర్తి కాలేదు. కాగా జిల్లావాసి పులివెందుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో పోటీలో నిలవనున్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు, నిర్దిష్టమైన అభివృద్ధి, సామాజిక న్యాయం ఆచరణలో చూపెట్టడం ఇవన్నీ వైఎస్సార్‌సీపీకి అదనపు అర్హతలుగా ఈమారు ఎన్నికలల్లో కన్పించనున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరోవైపు రాజకీయాలు మినహా నిర్దిష్టమైన అభివృద్ధి గురించి తెలుగుదేశం పార్టీ చెప్పుకోలేకపోవడం, ఎన్నికల మేనిఫెస్టో అమలు కాకపోవడం, మళ్లీ అవే హామీలు ఇస్తుండడం ఇవన్నీ ఆపార్టీని వెంటాడుతోందని పరిశీలకులు పోల్చి చెబుతున్నారు.



మహానేత వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అదృష్టాన్ని పరీక్షించుకోనున్న నేతలు....

ఈ మారు ఆయా అభ్యర్థులు వారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు రేపటి నుంచి వారి ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. కాగా ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోమారు పులివెందుల నుంచి తలపడనున్నారు. అక్కడి ప్రజానీకం క్రమం తప్పకుండా వైఎస్ కుటుంబాన్ని ఆదరిస్తూ వస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా ఈమారు బీటెక్ రవిని ఇదివరకే టీడీపీ ప్రకటించింది. మైదుకూరు ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ పడనున్నారు. ఇప్పటికే వీరు ప్రచారం కొనసాగిస్తున్నారు. జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి బరిలో నిలవనున్నారు. ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయించనున్నట్లు ప్రచారంలో ఉంది. ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి డైలామాలో పడ్డారు. నమ్ముకొని నడిచిన అధిష్టానం అన్యాయం చేసిందని ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. కమలాపురం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి మరోమారు బరిలో నిలవనున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు విజయం సాధించిన ఆయన హాట్రిక్ కోసం మరోమారు తలపడనున్నారు. టీడీపీ అభ్యర్థిగా ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తనయుడు పుత్తా చైతన్యరెడ్డి తొలిసారి ఎన్నికలల్లో పోటీ చేయనున్నారు.

ప్రొద్దుటూరు అభ్యర్థిగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పోటీ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి బరిలో నిలవనున్నారు. ఒకప్పటి గురుశిష్యుల మధ్య మరోమారు పోటీ అనివార్యమైంది. కడప అభ్యర్థిగా డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా బరిలో నిలవగా, టీడీపీ అభ్యర్థిగా మాధవీరెడ్డి పోటీ చేయనున్నారు. ఆమేరకు ఇరువురు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. బద్వేల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా మరోమారు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అక్కడ టీడీపీ అభ్యర్థి ఎంపిక ఖరారు కాలేదు. మరోవైపు బీజేపీకి ఆస్థానాన్ని కేటాయించనున్నట్లు ప్రచారం కొనసాగుతుండడం విశేషం.

నియోజకవర్గం	వైఎస్సార్‌సీపీఅభ్యర్థి	టీడీపీ అభ్యర్థి
పులివెందుల	వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి	మారెడ్డి రవీంద్రనాథరెడ్డి
మైదుకూరు	శెట్టిపల్లె రఘురామిరెడ్డి	పుట్టా సుధాకర్ యాదవ్
జమ్మలమడుగు	డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డి	ఖరారు కాలేదు
కమలాపురం	పి. రవీంద్రనాథరెడ్డి	పుత్తా చైతన్యరెడ్డి
బద్వేల్	డాక్టర్ దాసరి సుధ	ఖరారు కాలేదు
ప్రొద్దుటూరు	రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి	ఎన్.వరదరాజులరెడ్డి
కడప	ఎస్‌బి అంజద్‌బాషా	ఆర్ మాధవీరెడ్డి
కడప(లోక్‌సభ)	వైఎస్ అవినాష్‌రెడ్డి	ఖరారు కాలేదు

కడప లోక్‌సభ



పేరు: వైఎస్ అవినాష్‌రెడ్డి
పుట్టినతేదీ: 27.08.1984
తల్లిదండ్రులు: లక్ష్మి, వైఎస్ భాస్కర్‌రెడ్డి
భార్య: సమతారెడ్డి
సంతానం: విక్రాంత్‌రెడ్డి, ఆదిత్యరెడ్డి (కుమారులు)
రాజకీయ ప్రస్థానం: 2014లో తొలిసారి ఎంపీగా పోటీ చేశారు. ఆయనకు 6,71,983ఓట్లు లభించగా టీడీపీ అభ్యర్థి ఆర్ శ్రీనివాసులరెడ్డికి 4,81,660 ఓట్లు సాధించారు. తొలిప్రయత్నంలో 1,90,323 ఓట్లు భారీ మెజార్టీతో వైఎస్ అవినాష్‌రెడ్డి విజయాన్ని సొంతం చేసుకున్నారు. 2019లో రెండో ప్రయత్నంలో కడప ఎంపీగా పోటీ చేసిన ఆయన 7,83,499 ఓట్లు సాధించారు. తన ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి సి ఆదినారాయణరెడ్డికి 4,02,733 ఓట్లు లభించాయి. దీంతో 3,80,766 ఓట్లుతో రెట్టింపు మెజార్టీ దక్కించుకున్నారు. మరోమారు హాట్రిక్ సాధించేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రకటించారు.

కడప (అసెంబ్లీ)



పేరు: షేక్ బెపారి అంజద్ బాషా
తల్లిదండ్రులు: నూర్జహాన్ బేగం, షేక్ బెపారి అబ్దుల్ ఖాదర్
పుట్టిన తేదీ: 12-08-1971
భార్య : ఎస్‌బి నౌరిన్ ఫాతిమా
సంతానం: జైబా జువేరియా(కుమార్తె)
అనుభవం: 2005లో 29వ డివిజన్ కార్పొరేటర్, 2014లో కడప ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019లో రెండోసారి కడప ఎమ్మెల్యేగా విజయం సాధించారు, మైనార్టీ సంక్షేమ శాఖామంత్రిగా పనిచేశారు.

బద్వేలు



పేరు: డాక్టర్ దాసరి సుధ
తల్లిదండ్రులు: విక్టోరియా, డాక్టర్ ఓబులయ్య
భర్త: డాక్టర్ వెంకటసుబ్బయ్య(దివంగత ఎమ్మెల్యే)
పుట్టిన తేదీ: 9.2.1972
విద్యార్హతలు: ఎంబీబీఎస్, డీజీఓ
సంతానం: హేమంత(కుమార్తె) తనయ్(కుమారుడు)
- డాక్టర్ సుధ భర్త వెంకటసుబ్బయ్య ఎమ్మెల్యేగా 2021లో మృతి చెందగా ఆయన స్థానంలో ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ప్రొద్దుటూరు



పేరు: రాచమల్లు శివప్రసాదరెడ్డి
తల్లిదండ్రులు: రత్నమ్మ, రాచమల్లు శివశంకర్‌రెడ్డి
భార్య: రాచమల్లు రమాదేవి (26వ వార్డు కౌన్సిలర్)
పుట్టిన తేదీ: 1967 డిసెంబర్ 20
సంతానం: పల్లవి, కృష్ణ కావ్య (కుమార్తెలు)
రాజకీయ నేపథ్యం: తన మేన మామ పాతకోట వియజమునిరెడ్డి మరణంతో 1997లో కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.
- 2011లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజుల రెడ్డిపై 12,828 ఓట్లతో విజయం సాధించారు.
- 2019 ఎన్నికల్లో మల్లెల లింగారెడ్డిపై 43,148 ఓట్లతో గెలుపొందారు. ప్రస్తుతం మూడో మారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

కమలాపురం



పేరు: పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి
వయసు: 65
తల్లి దండ్రులు: తులశమ్మ, రామాంజుల రెడ్డి
భార్య: అరుణమ్మ
సంతానం: రమ్యతారెడ్డి(కుమార్తె), నరేస్ రామాంజులు రెడ్డి(కుమారుడు)
రాజకీయ నేపథ్యం
- 2001లో కాంగ్రెస్ పార్టీ తరపున చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీగా ఎన్నికై 2001 నుంచి 2006 వరకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పని చేశారు.
- 2005 లో కార్పొరేటర్‌గా ఎన్నికై 2005 నుంచి 2010 వరకు కడప మొదటి మేయర్‌గా పని చేశారు.
- 2014, 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ తరుపున పోటీ చేసి కమలాపురం ఎమ్మెల్యేగా వరుసగా రెండు సార్లు ఎన్నికయ్యారు.

మైదుకూరు



పేరు: శెట్టిపల్లె రఘురామిరెడ్డి
తల్లిదండ్రులు: శెట్టిపల్లె సుబ్బమ్మ, చిన్ననాగిరెడ్డి
పుట్టిన తేదీ: 20.06.1947
భార్య: ప్రభావతి,
కూతురు: సుధా
కుమారులు: నాగిరెడ్డి, అశోక్‌రెడ్డి(బాబ్జీ), దుష్యంత్‌రెడ్డి(శ్రీనివాసులరెడ్డి)
రాజకీయ నేపథ్యం: ప్రొద్దుటూరు సమితి ప్రెసిడెంటుగా చేసిన రఘురామిరెడ్డి 1985లో ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి డీఎల్ రవీంద్రారెడ్డిపై గెలుపొందారు. 1989, 1994లో ఓడిపోగా, 1999లో గెలుపొందారు. 2004, 2009లో ఓటమి చెందిన రఘురామిరెడ్డి 2011లో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2014లో 12 వేలతో, 2019లో 29,332 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి సుధాకర్ యాదవ్‌పై గెలుపొందారు.

జమ్మలమడుగు



పేరు: డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి
పుట్టిన తేదీ: 12-03-1981
విద్యార్హత: ఎంబీబీఎస్ అనస్తీయా
తల్లిదండ్రులు: మూలె లక్ష్మీదేవి ఎంపీపీ, వెంకట సుబ్బారెడ్డి(తండ్రి చనిపోయారు)
భార్య: క్రాంతి ప్రియ
సంతానం: దిహాన్సికరెడ్డి(కుమార్తె)
రాజకీయ నేపథ్యం:
- 2016లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జీగా బాధ్యతలు చేపట్టారు.
- 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోనే 51641 ఓట్ల మెజార్టీ సాధించి నాలుగో స్థానంలో నిలిచారు.
- సుధీర్‌రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ మైసూరారెడ్డి సోదరుడి కుమారుడు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ

- అమలుల్లోకి 'కోడ్'
- ఓటర్లు 16.22 లక్షలు
- 5838 మంది పోలీసుల సేవలు
- కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు, చిత్రంలో ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప సెవెన్‌రోడ్స్: లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తామని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఓటరును ఎన్నికల్లో భాగస్వామ్యం చేసేందుకు పలు సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లా జనాభా 22.47 లక్షలు కాగా, ఓటర్లు 16.22 లక్షలు ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్లు–జనాభా నిష్పత్తి 722 ఉందన్నారు. కొత్తగా 39,875 మంది ఓటర్లు నమోదు కాగా, అందులో పీడబ్ల్యుడీ ఓటర్లు 18,440 మంది ఉండగా, 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 7395 మంది ఉన్నారన్నారు. వీరికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఆదివారం నుంచి ఫారం–7, 8 స్వీకరించబోమన్నారు. నామినేషన్ల ఆఖరి వరకు ఫారం–6 మాత్రం స్వీకరిస్తామన్నారు. జిల్లాలో ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కలిపి మొత్తం 2035 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అందులో క్రిటికల్ 527, వల్నరబుల్ 14 ఉన్నాయన్నారు. వీటిలో మైక్రో అబ్జర్వర్లు, కేంద్ర పోలీసు బలగాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 16 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతామన్నారు. ఎవరైనా ఎన్నికల విధుల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 2,28,883 ఎపిక్ కార్డులు జారీచేశామని, వీరికి పోస్టల్ ద్వారా అందజేస్తామన్నారు. ఒకవేళ అవి తిరిగి వస్తే బీఎల్‌ఓల ద్వారా పంపుతామన్నారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులోకి వచ్చిందని తెలిపారు. నేషనల్ గ్రీవెన్స్‌సర్వీస్ పోర్టల్, సీ–విజిల్ యాప్, సువిధ యాప్, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, కేవైసీ యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. ఓటర్ల సహాయార్థం కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని, ఫిర్యాదులు ఉంటే 08562–315672కు ఫోన్ చేయాలని సూచించారు. 50 వేల రూపాయలు పైబడి నగదు తీసుకువెళ్లే వారిని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆధారాలు చూపెడితే జిల్లా స్టీరింగ్ కమిటీ పరిశీలించి 24 గంటల్లో తిరిగి నగదు వాపసు ఇస్తామన్నారు. బ్యాంకుల నుంచి నగదు తీసుకెళ్లేటపుడు క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా 5838 మంది పోలీసు సిబ్బంది సేవలు వినియోగిస్తామని ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. ఇప్పటికే మూడు కంపెనీల కేంద్ర బలగాలు ఉన్నాయని, పోలింగ్ సమయానికి పది సీఆర్‌పీఎఫ్ కంపెనీలు జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు. మాజీ సైనికులు, రిటైర్డ్ పోలీసుల సేవలు కూడా వినియోగించుకుంటామన్నారు. ప్రతి రిటర్నింగ్ అధికారితో పోలీసుల తరుపున డీఎస్పీ ర్యాంకు అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమిస్తున్నామన్నారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జిల్లాలోకి డబ్బు, అక్రమ మద్యం, ఆయుధాలు, విలువైన వస్తువులు రాకుండా నిఘా ఉంచుతున్నామని తెలిపారు. ఎస్ఐ, సీఐలకు తిరుపతి, అనంతపురంలలో శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. జిల్లాలో 15 వేల మంది పైబడి బైండోవర్ చేశామన్నారు. అభ్యర్థులు మోడల్ కోడ్ పాటించకపోతే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. 24 గంటల్లో లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ పాల్గొన్నారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది



బద్వేలు: రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కేంద్ర ఎన్నికల సంఘం 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన నేపథ్యంలో శనివారం నుంచే కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో జిల్లాలోని బద్వేలు, గోపవరం, కమలాపురంలో దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించే పనిలో మున్సిపల్, పంచాయతీల సిబ్బంది నిమగ్నమయ్యారు. -సాక్షి నెట్‌వర్క్



కమలాపురంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు
- హాజరుకానున్న 27,858 మంది విద్యార్థులు
- జిల్లాలో 153 పరీక్ష కేంద్రాలు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల నుంచి 27,858 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.వీరి కోసం 153 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పిల్లలకు తాగునీరు, పరీక్ష కేంద్రాల్లో తగినంత గాలి, వెలుతురు ఉండే విధంగా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు.

- టెన్త్ పరీక్షలకు 48 గంటలు మాత్రమే గడువు ఉంది. 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభంకానుండటంతో అధికారులకు కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. అలాగే కేంద్రాల గుర్తింపు, విద్యార్థుల కేటాయింపు, చీఫ్ సూపరింటెండెట్లు, డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. పరీక్షల నిర్వహణపై వారికి శిక్షణ ఇచ్చారు. 12161 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. వీరితో పాటు 153 మంది చీఫ సూపరింటెండెట్లు, 153 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించారు. 153 మంది సిట్టింగ్ స్క్వాడ్, 07 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.
- ఈసారి పదో తరగతి పశ్నపత్రాల తయారీలో ప్రభుత్వం కొత్త టెక్నాలజీని ఉపయోగించింది. ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసినా, జిరాక్స్ చేయించినా అది ఏ ఊరు, ఏ కేంద్రం, ఏ విద్యార్థికి కేటాయించినదో తెలిసిపోతుంది. ఎవరైనా లీక్ చేయాలని చూసినా ఇట్టే దొరికిపోతారు.



పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ఏర్పాట్లు పూర్తి చేశాం



పది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశాం. విద్యార్థులంతా నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఆలస్యమైతే లోపలికి అనుమతించం.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

మేనేజ్‌మెంట్	స్కూళ్లు	రెగ్యులర్
జెడ్పీ	203	9420
కేజీబీవీ	17	615
మున్సిపాలిటీ	17	1782
ఏపీ మోడల్	03	255
ఏపీఎస్‌డబ్లూఆర్ఎస్ /టీఆర్‌డబ్ల్యూ	25	1394
రెసిడెన్సియల్ గవర్నమెంట్	09	681
ఎయిడెడ్	18	653
ప్రైవేట్	289	13058

పరీక్షల షెడ్యూల్... (ఏఎం)

తేదీ	సబ్జెక్టు	సమయం
18.03.24	ఫస్ట్ లాంగ్వేజ్	9.30–12.45
19.03.24	సెకండ్ లాంగ్వేజ్	9.30–12.45
20.03.24	ఇంగ్లీషు	9.30–12.45
22.03.24	మేథమేటిక్స్	9.30–12.45
23.03.24	ఫిజికల్ సైన్స్	9.30–11.30
26.03.24	బయలాజికల్ సైన్సు	9.30–11.30
27.03.24	సోసియల్	9.30–12.45
28.03.24	ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-2	9.30–11.15

అధికారులే కీలకం!

రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో కీలకపాత్ర పోషించేది జిల్లా అధికారులే. అందులో ఒకరు కలెక్టర్.. మరొకరు జిల్లా ఎస్పీ. వీరికి తోడు ఆర్‌ఓ, పోలింగ్ ఆఫీసర్ల పాత్రలు కూడా ప్రధానమైనవే. రానున్న ఎన్నికల రథసారథుల గురించి తెలుసుకుందాం..

- జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్
- ప్రతి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి
- నామినేషన్ల పర్వం వీరి కనుసన్నల్లోనే

రాజంపేట : ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రజల తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు కౌంట్‌డౌన్ మొదలైంది. భారత ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటుంది. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడంలో బూత్‌స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎందరో అధికారుల శ్రమ ఉంటుంది. అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుందనడంలో సందేహం లేదు.

అధికారుల విధులు తెలుసుకుందాం..

ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాలు వెల్లడించే వరకు ప్రతి సందర్భంలో అధికారుల విధుల గురించి ప్రతి ఓటరు తెలుసుకోవాల్సి ఉంది.

ప్రధాన ఎన్నికల అధికారి

రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం సంబంధిత రాష్ట్రాన్ని సంప్రదించి ప్రధాన ఎన్నికల అధికారిని నియమిస్తుంది. రాష్ట్రంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రధాన ఎన్నికల అధికారికి ఉంటుంది.

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణ, నియంత్రణకు లోబడి ప్రతి జిల్లాకు ఒక జిల్లా అధికారి ఉంటారు. సంబంధిత కలెక్టర్ ఈ బాధ్యతలను నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తూ ఎన్నికల నిర్వహణలో కీలకభూమిక పోషిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)

శాసనసభ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఆయా నియోజకర్గాలలో రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులు, అభ్యర్థుల తుది జాబితా వీరే తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది నియామకం , వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు , ఫలితాలు ప్రకటన తదితర పనులు ఆర్‌ఓ పర్యవేక్షణలో జరుగుతాయి.



అన్నమయ్య జిల్లా కలెక్టరేట్

సెక్టోరల్ అధికారి

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఒక సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట 144 సెక్షన్ విధించే అవకాశం సెక్టోరల్ అధికారికి ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ బూత్‌లు గుర్తించి అక్కడ బందోబస్తుకు సిఫార్సు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి..

ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆయన పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను బూత్‌కు తీసుకువస్తారు. పోలింగ్ అనంతరం సీల్ వేసి స్ట్రాంగ్‌రూంకు తరలిస్తారు. ఇతనికి మరో అధికారి ఏపీఓ ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే అన్ని కార్యకలాపాలు ఈయన పర్యవేక్షణలోనే జరుగుతాయి.

ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు మండలాలకు ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఉంటుంది. వీరు ఆ పరిధిలో మద్యం, డబ్బు, ప్రలోభపరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహిస్తారు.

మైక్రో అబ్జర్వర్లు

ఎన్నికలు జరిగే తీరుపై నివేదిక రూపొందించి జిల్లా రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపడంలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారు.

బీఎల్‌ఓలు..

కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి దరఖాస్తులను అందచేయడం, ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడం బీఎల్‌ఓల బాధ్యత. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు గురించి ఉన్నతాధికారులకు తెలియచేయడం, ఓటరు జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర సేవలను అందిస్తారు.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల జాబితాను తయారు చేయడం ఈయన బాధ్యత. ఓటు నమోదు చేసుకునే వారు జాబితాలో పేర్లు తప్పుగా ఉన్న వారు ఈయనను సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు. ఈయన పర్యవేక్షణలో కొందరు సిబ్బంది పనిచేస్తారు.

ఎన్నికల నిబంధనలు ఇవే...

- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడం నేరం. ఉల్లంఘనలపై ఈ కింది సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.
- ప్రజాప్రాతినిధ్యచట్టం 1951 సెక్షన్ 123(1) ప్రకారం ఓటర్లను ప్రలోభ పెట్టడం, భయాందోళనకు గురిచేయడం, కుల, మత విద్వేషాలను పెంచడం, ఎదుటి వారి వ్యక్తిగత విషయాలను విమర్శించడం నేరం.
- సెక్షన్ 125 ప్రకారం శత్రుత్వం కలిగించడం నేరం. సెక్షన్126 ప్రకారం నిషేధిత ప్రాంతాల్లో ప్రచారం చేయడం చట్టవిరుద్ధం.
- సెక్షన్ 127 ప్రకారం ఇతరుల సమావేశాలను భంగపరచటం, 127(ఎ) ప్రకారం పోస్టర్లను, కరపత్రాలపై నియంత్రణ లేకపోవడం నేరం.
- సెక్షన్ 128 ప్రకారం రహస్య ఓటింగ్‌కు భంగం కలిగించడం నేరం.సెక్షన్ 130, 131, 132 ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేయడం, క్రమశిక్షణ లేకుండా బూత్‌ల వద్ద ప్రవర్తించడం, హద్దుమీరి వ్యవహరించడం నేరం
- సెక్షన్ 133 ప్రకారం ఓటర్లను చేరవేసేందుకు వాహనాలు ఉపయోగించడం నేరం, 134 ప్రకారం ఓటర్లకు తాయిలాలు పంపిణీ చేయడం నిషేధం.
- సెక్షన్ 135, 135ఎ,136ల ప్రకారం పోలింగ్ స్టేషన్లను ఆక్రమించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, రికార్డులను తొలగించడం, నాశనం చేయడం, ధ్వంసం చేయడం నేరం.
- సెక్షన్ 171జీ ప్రకారం ఎన్నికలకు సంబంధించి అసత్య ప్రచారాలు చేయడం, 172 హెచ్, 172 ఐ ప్రకారం ఖర్చుచేసిన నిధులకు లెక్కలు చెప్పకపోవడం వంటి తదితర నేరాలన్ని ఎన్నికల ప్రవర్తన నియమావళిలోకి వస్తాయి.

బక్కన్నగారిపల్లెలో అరటితోట దగ్ధం

– రూ.7లక్షల మేర ఆస్తినష్టం



ఆవేదన వ్యక్తం చేస్తున్న అరటిరైతు

వేంపల్లె : మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామంలో బుక్కే శీనునాయక్ అనే రైతు 3 ఎకరాల అరటితోట మంటలు చెలరేగి దగ్ధమైంది. శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు .. బుక్కే శీనునాయక్ 3 ఎకరాలు అరటి తోటను సాగుచేశాడు. అయితే తన పొలం పక్కన గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల పొదలకు నిప్పు పెట్టారు. దీంతో నిప్పురాసుకుంటూ అరటితోటకు వ్యాపించింది. స్థానికులు గమనించి రైతుకు సమాచారం ఇవ్వగా, వెంటనే ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు. ఫైర్ ఇంజన్ వచ్చేలోపు తనకున్న మూడు ఎకరాల అరటితోట, డ్రిప్పుపైపులు, ప్లాస్టిక్ పైపులు అన్ని కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.7లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అరటితోట గెలలు వేసి 20 రోజుల్లో కోతకు వచ్చే సమయంలో ఇలా జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకొని తనకు నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

కడప వాసికి ఏపీఎన్ఆర్‌టీఎస్ తోడ్పాటు

– కేసుల్లేకుండా ఇండియాకు వచ్చేందుకు సహకారం



రఫీకి విమాన టికెట్లను అందజేస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ తదితరులు

కడప కార్పొరేషన్ : కడప నగరం కుమ్మరికుంటకు చెందిన షేక్ మహమ్మద్ రఫీకి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) తోడ్పాటునందించింది. వివరాలిలా ఉన్నాయి. రఫీ 6 మాసాల క్రితం డ్రైవర్ పని కోసం కువైట్ వెళ్లాడు. కువైటీ (స్పాన్సర్) ప్రతి రోజు కొట్టడం తిట్టడం చేసేవాడు. రెండు నెలలు ఓపిక పట్టిన ఆయన కువైటీ ఇంటి నుంచి పారిపోయి తెలిసిన వారి దగ్గర ఆశ్రయం పొందాడు. వీసా తీసిన ఏజెంట్‌ను అడిగితే నీవు చెప్పకుండా పారిపోయావు నేను ఏమీ చేయలేనని చేతులెత్తేశాడు. కడపలో ఉంటున్న రఫీ తల్లి జరిగిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ 34వ డివిజన్ ఇన్‌చార్జి ఏ.అలీ ద్వారా ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్‌కు తెలిపింది. ఆయన వెంటనే స్పందించి వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ నాయని మహేష్ రెడ్డిల ద్వారా భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి షేక్ మహమ్మద్ రఫీపై ఎలాంటి కేసులు లేకుండా, జైలుకు వెళ్లకుండా అవసరం అయితే మళ్లీ కువైట్ వచ్చేటట్లు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు రఫీ మాట్లాడుతూ తాను కువైటీ ఇంటినుంచి పారిపోయి వచ్చాక ఏజెంట్ మొదలుకొని అందరకూ నీవు ఇండియాకు పోవాలంటే జైలుకు పోవాలి, మళ్లీ కువైట్‌కు రాలేవని చెప్పారని, దాంతో చాలా భయమేసిందన్నారు. దేవుడి దయ వల్ల ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు సొంత అన్నల్లాగా తనకు సాయం చేశారని, వారి ద్వారా ప్రవాసాంధ్రులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కువైట్ కమిటీ సభ్యులు గోవిందు నాగరాజు, ఎం. చంద్రశేఖర్ రెడ్డి, పి. సురేష్ రెడ్డి, పి. గంగిరెడ్డి, సయీద్ నజర్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె గ్రామంలోని బె జవాడ దళితవాడలో శుక్రవారం రాత్రి గండుపల్లె సుధాకర్ (40) అనే వ్యక్తి విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని గంగమ్మ గుడి వద్ద శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాత్రి గుడిలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో సుధాకర్ ద్యుత్‌ను పునరుద్ధరించేందుకు గుడిపైకి ఎక్కి మరమ్మతులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడ నుంచి కింద పడ్డాడు. వెంటనే స్థానికులు, బంధువులు సుధాకర్‌ను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న వీరబల్లె ఎస్‌ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, 8 సంవత్సరాల వయస్సు ఉన్న పాప ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరాం



పార్టీలో చేరిన సున్నపురాళ్లపల్లె వాసులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరామని బీసీ కాలనీకి చెందిన కమటం రాముడు, సంజయ్‌లు పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన కమటం రాముడు, సంజయ్, సుబ్బన్నలతో పాటు మరో 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి కండువాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న చేపట్టిన పథకాలు కొనసాగాలంటే ప్రజలు మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు ఓటు వేస్తే నిరుపయోగం అవుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు పాచిరెడ్డి, సుంకన్న, కోఆప్షన్‌మెంబర్ లక్షుమయ్య, లోగిడి జయన్న, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : మండలంలోని సున్నపురాళ్లపల్లి గ్రామానికి చెందిన ద్వారకచర్ల వినోద్ రెడ్డితోపాటు మరో 20 కుటుంబాల వారు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసుకోవాలన్నారు.

రాజీ మార్గంలో కేసుల పరిష్కారం సులభతరం

- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : రాజీ మార్గంలో కేసులను పరిష్కారం చేసుకునే అవకాశం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా కడప నగరంలోని జిల్లా కోర్టు ఆవరణంతో పాటు, ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని మిగిలిన 12 కోర్టులలో మొత్తం 24 బెంచీలను ఏర్పాటు చేసి జాతీయలోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయ సేవాసదన్‌లో జాతీయలోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టులలో పెండింగ్‌లో ఉండి, రాజీ కాదగిన కేసుల పరిష్కారం కోసం 24 బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తేదీని నిర్ణయించినప్పటి నుంచిరాజీ కాదగిన కేసులను పరిష్కరించే విషయంలో వివిధ శాఖల అధికారులు తమ వంతుగా కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జి.గీత, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె. హేమస్రవంతి, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. నందిని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. విజయలక్ష్మి, న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 3000 కేసులకు పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 13 కోర్టులలో ఏర్పాటు చేసిన 24 బెంచీలలో 3000 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా కక్షిదారులకు రూ. 10,05,21,071 లు నష్టపరిహారం ద్వారా అందజేయాలని ఉత్తర్వులను ఇచ్చారు. ఇంకా కేసుల పరిష్కారం కొనసాగుతోంది.

లోక్ అదాలత్‌లో 63 కేసులు పరిష్కారం

సిద్దవటం: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 63 కేసులు పరిష్కరించామని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ అన్నారు. సిద్దవటం కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం పోలీసు స్టేషన్, అట్లూరు , ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌ల పరిధిలోని క్రిమినల్ కేసులు 14, సివిల్ కేసులు 4, భార్యా భర్తల కేసులు 3, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన కేసులు 18, ప్రీ లిటిగేషన్ రెగ్యులర్ కేసులు 14, బ్యాంకు రుణాల కేసు 1, అడ్మిషన్ కేసులు 9, మొత్తం 63 కేసులను పరిష్కరించామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన కేసుల సెటిల్‌మెంట్ అమౌంట్ రూ. 6,160 , బ్యాంకు రుణాల కేసులో సెటిల్ మెంట్ అమౌంట్ రూ. 32,157 అడ్మిషన్ కేసుల్లో సెటిల్ మెంట్ అమౌంట్ రూ.19,200 కలిపి మొత్తం రూ. 57,517 వచ్చిదన్నారు. క్షణికావేశంలో జరిగే ఘర్షణలను గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలే తప్ప, పోలీసు స్టేషన్‌ల వరకు వెళ్ల కూడదన్నారు. న్యాయవాదులు బి. వెంకటరత్నం, రామదాసు, శివరామ్, మండల లీగల్ సర్వీసెస్ సభ్యులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, ఫిర్యాదుదారులు, తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి కమాండెంట్ పి.రవిశంకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ, ఆశయాల కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంటు నాగేశ్వరప్ప, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.